క్లుప్తంగా

కొండకు నిప్పు



ఎల్‌జీబీనగర్ దగ్గర దగ్ధమవుతున్న కొండ

రొద్దం: మండలంలోని ఎల్‌జీబీ నగర్ సమీపంలోని కొండకు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి 10 గంటల సమయంలో నిప్పు పెట్టడంతో వచ్చని కొండ దగ్ధమైంది. పావగడ - పెనుకొండ ప్రధాన రహదారి పక్కనే రైతుల మామిడి తోటలు ఉండటంతో సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది తరలివచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

మామిడి తోటకు...

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లికి చెందిన రైతు బసవరాజు సాగు చేసిన మామిడి తోటకు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం మధ్యాహ్నం నిప్పు పెట్టారు. దీంతో తోటలో ఉన్న మామిడి చెట్లు కాలిపోయాయని బాధితుడు వాపోయారు. ప్రస్తుతం కాయలు పక్వ దశకు వచ్చాయని, సుమారు రూ.30 వేలు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

గొర్రెల షెడ్‌కు...



మంటల్లో దగ్ధమైన గొర్రెల షెడ్

పావగడ: తాలూకాలోని పెమ్మనహళ్లి గొల్లరహట్టికి చెందిన రైతు చిత్తయ్య గొర్రెల షెడ్ అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు వివరాలమేరకు... బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆకతాయిలు షెడ్‌కు నిప్పంటించడంతో 15 గొర్రెలు, 3 మేకలు సజీవ దహనమయ్యాయన్నారు. మూడు పశువులను మాత్రం కాపాడగలిగానని, సుమారు రూ. 3 లక్షల ఆస్తినష్టం సంభవించినట్లు కన్నీరు మున్నీరయ్యారు. అరసికెర పోలీసులు, స్థానిక పశు వైద్యాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెల మృతదేహాలను పరిశీలించారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

పావగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల నామినేషన్ పత్రాల స్వీకరణ ప్రక్రియ గురువారం ప్రారంభం కానుందని స్థానిక ఎన్నికల అధికారిణి కే ఎస్ సుజాత తెలిపారు. ఈ నెల 20తో ప్రక్రియ ముగుస్తుందన్నారు. స్థానిక తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండలంలోని పుట్టగుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని గుంతపల్లిలో ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఉదయ 7 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని గోవిందాపురం సచివాలయం పరిధిలోని గుద్దిలపల్లి, సంకమ్మపాళ్యం గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత, ఎంపీటీసీ తాళికేరమ్మ తెలిపారు.

కూలీల సంఖ్య పెంచండి

అమరాపురం: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మునిస్వామి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

సోమందేపల్లి: మండలంలోని కేతగాని చెరువు గ్రామ సమీపంలో బుధవారం పొలాల నుంచి రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ జింక మృతి చెందింది. అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రక్తదానం మహాదానం

హిందూపురం: రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేయొచ్చని శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ రీజినల్ ఆఫీసర్ హరిబాబు అన్నారు. శ్రీరామ్ చిట్స్ 50వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక రహమత్‌పురం సర్కిల్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ సిబ్బందితో పాటు పలువురు రక్తదానం అందించి ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధికి అందజేశారు.

ఘనంగా మారెమ్మ ఊరేగింపు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిర రూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామ సమీపంలో వెలిసిన గౌడు చంద్ర మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని బుధవారం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. గ్రామానికి మంచి జరగాలని ఆకాంక్షిస్తూ ఊరేగింపు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్'

- అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్న గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు
- ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని వెల్లడి



చిలమత్తూరు: అప్పనపల్లిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ ఇక్బాల్

చిలమత్తూరు: ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ తెలిపారు. బుధవారం చిలమత్తూరు మండలంలోని బీసీ కాలనీ, అప్పనపల్లి గ్రామాల్లో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు "మా నమ్మకం నువ్వే జగన్" స్టిక్కర్లు అతికించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబంలోనూ సంతోషం నింపారన్నారు. మహిళల అభ్యున్నతికి అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని కొనియాడారు. అనంతరం పెద్దనపల్లిలో విలేకరి రవీంద్రరెడ్డి తండ్రి ఇటీవలే మరణించగా పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, గిరీష్‌రెడ్డి, నాగరాజు యాదవ్, కోడూరు సర్పంచ్ మురళి, వైస్ ఎంపీపీ బయప్ప తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: హిందూపురం మున్సిపాల్టీలోని 4, 5, 10, 14, 15, 16, 17, 19, 30, 36, 38 వార్డుల్లో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, ఆ వార్డు కౌన్సిలర్లు, గృహసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి వారిని ప్రజలు ఆప్యాయంగా పలకరించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వానికి ఉన్న ఆదరణకు ఓర్వలేక చంద్రబాబు, లోకేష్ టీడీపీ నాయకులతో పాటు ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజల మనస్సుల్లో విషబీజాలు నాటడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అయినా ప్రజలు వారి మాటలను నమ్మడంలేదని, ప్రజలు జగనన్న వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగించాలంటే మరోసారి జగనన్నకే పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున, ఆయుబ్, రోషన్, నాయకులు సోమశేఖర్‌రెడ్డి, ఇలియాజ్, మల్లికాబేగం, నౌషద్, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్నారని ఎమ్మెల్సీ మహ్మద్‌ఇక్బాల్ తెలిపారు. బుధవారం మండలంలోని రాజీవ్‌కాలనీ, లేపాక్షి తదితర గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్నతోనే భావితరాలకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, అలాంటి గొప్ప నాయకుడికి ప్రజలు అండగా నిలవాలని తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, కోడిపల్లి తదితర గ్రామాల్లోనూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజనరెడ్డి, నీలావతి, సర్పంచులు ఆదినారాయణ, కోఆప్షన్ సభ్యులు బషీర్, నాయకులు శంకరప్ప, ప్రభాకర్, తిప్పన్న, నిస్సార్, నరసప్ప, ప్రసాద్, రాజు, రామాంజి, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: సంక్షేమ పథకాల అమలుతో పేద ప్రజల జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. బుధవారం చౌళూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయాలను సేకరించి, మిస్డ్ కాల్ ఇప్పించడంతో పాటు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ నంజప్ప, ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణవేణి, రంగనాథ్, రాజు, లోకేష్, జమీరుద్దీన, నిజాం తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. బుధవారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమాభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కి మాత్రమే దక్కిందని మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హొట్టేబెట్ట పంచాయతీ పరిధిలోని కొత్తపాళ్యం, కొత్తపాళ్యంతండా తదితర గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఇళ్ల డోర్లకు 'మా నమ్మకం నువ్వే జగనన్న' స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి అనుమతిలో ' మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇంటి తలుపులకు అతికించడంతో పాటు ఐదు ప్రశ్నలను అడిగి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని బీచిగానిపల్లి, శ్రీరంగరాజుపల్లి, కొడిగెనహళ్లి, హొన్నంపల్లి, మోదా, ఊటుకూరు, శాసనకోట, ఎర్రగుంట పంచాయతీ గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపలోనూ లబ్ధిదారులు ఆనందంతో తమ గడపలకు స్టిక్కర్లు వేయించుకున్నారు. అలాగే 82960 82960కు మిస్డ్ కాల్ ఇచ్చారు. వైస్ ఎంపీపీ వేదవతి, సచివాలయ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, సర్పంచులు మంజునాథ్‌రెడ్డి, లక్ష్మీదేవి, శ్రీరామప్ప, దిలీప్, నరసింహారెడ్డి, బాలు, అంజి, వైస్ సర్పంచులు మురళి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ప్రతి గడపకూ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో జరుగుతున్న మంచిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయ కన్వీనర్లు , సర్పంచులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గుడిబండ: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే తమ మద్దతని ప్రజలంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు పచ్చ కండువాలు వేసుకున్న వారికే వచ్చేవని, నేడు అర్హతే ప్రామాణికంగా సంక్షమ పథకాలు అందిస్తున్నారని, మరోసారి జగనన్నకే మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు అన్నారు. బుధవారం మండలంలోని నాగలూరు, శెట్టిపల్లి, అడదాకులపల్లి, వెంకటరెడ్డిపల్లి, గోనిపేట, రాంపురం, గుట్టూరు, దుద్దేబండ గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ లబ్ధిని వివరించారు. నాయకులు నారాయణస్వామి, వెంకటేశులు, శ్యామునాయక్, సాయి, సోమిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు బాబు, రామచంద్ర, మహేంద్ర, గృహ సారథులు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జోరుగా సాగింది. జేసీఎస్ కన్వీనర్ విక్రమ్ ఆధ్వర్యంలో 20 వార్డుల పరిధిలో కూడా వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, కౌన్సిలర్లు , వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అగళిలో...

మడకశిర(అగళి): అగళి మండలంలో బుధవారం ఊరూరా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ శివన్న, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.



హిందూపురం: చౌళూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న చౌళూరు మధుమతిరెడ్డి



గుడిబండ: జవనదుకా గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న గృహసారథులు



పెనుకొండ రూరల్: నాగలూరులో

జగనన్నకే మా మద్దతు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు తిప్పమ్మ, మడకశిర మండలం గోవిందాపురం. వైఎస్సార్ ఆసరా కింద రూ.4,060 , రైతు భరోసా ద్వారా రూ.40,500, పింఛన్ కానుక కింద రూ.24,000, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500, సున్నా వడ్డీ కింద రూ.2,088 చొప్పున ప్రభుత్వ పథకాల ద్వారా మొత్తం రూ.1.08,146 లబ్ధి పొందారు. తమ కుటుంబానికి ఆర్థికంగా ఎంతో భరోసా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కే మద్దతుగా నిలుస్తామని తిప్పమ్మ తెలిపారు.

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారు
- మరోసారి జగన్‌ను సీఎంగా చేసుకుంటామంటున్న ప్రజలు



గోవిందాపురంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: గ్రామస్థాయిలో అట్టడుగు ప్రజల అర్హతను గుర్తించి సంక్షేమ పథకాలు మంజూరు చేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ మా మద్దతు ఇస్తామని లబ్ధిదారులు, మహిళలు పేర్కొన్నారు. మండల పరిధిలోని గోవిందాపురం గ్రామ సచివాలయం పరిధిలోని గోవిందాపురంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికి లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను కుటుంబ సభ్యులకు అందించారు. ఇందులో భాగంగానే ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఇంటి వద్దకు వెళ్లిన తమ కుటుంబానికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు.కార్యకర్తలు ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానించారు.

అసత్యా ప్రచారాలను నమ్మొద్దు

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. గ్రామాల్లో సంక్షేమ పథకాలపై టీడీపీ నాయకుల చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, ఎంపీటీసీ తాళికేరమ్మ, మాజీ సర్పంచ్ విశ్వనాథ్, మండల జగనన్న సచివాలయ కన్వీనర్ నాగేంద్రయాదవ్, నాయకులు రవి, జయరామ్, సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, ఎంపీడీఓ సానిబాయి, ఈఓఆర్డీ శైలజ, కార్యదర్శి ఈరలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన నిర్ణయం హర్షణీయం

- రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని



అమరాపురం: రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రాష్ట్రంలోని బీసీ కులాలకు సంబంధించిన అన్ని కులాల కుల గణన చేయాలని నిర్ణయం తీసుకోవడం సంతోషమన్నారు. ఏ కులాల వారు ఎక్కడ ఉన్నారు? వారి స్థితిగతులు తెలుసుకోవడంతో పాటు ఆయా కులాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే విషయం తీసుకోవడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుందని పేర్కొన్నారు. దేశంలోనే మొదటిసారిగా కుల గణన చేయాలని నిర్ణయం తీసుకోవడంతో పాటు ఎక్కడైనా కుల గణన చేస్తుంటే అక్కడికి వెళ్లి అధ్యయం చేయడానికి ఓ కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. బీసీ కులాలకు వెన్నంటే ఉన్న సీఎం జగనన్నకు బీసీలందరూ రుణపడి ఉండాలన్నారు.

యంత్ర సేవ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



యంత్రాలను అందజేస్తున్న అధికారులు

పెనుకొండ రూరల్: వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రెండో విడత యంత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని రాంపురం, యర్రమంచి గ్రామాలలో బుధవారం లబ్ధిదారులకు యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ నాగభూషణ, కురుబవాండ్లపల్లి సర్పంచ్ నాగమూర్తి, మరువపల్లి యంత్ర సేవా సభ్యులు అశ్వర్థనారాయణ, జనార్ధన్, చంద్రశేఖర్, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు. యంత్ర సేవా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ రైతులకు సూచించారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

రొళ్ల: గ్రామాల్లో ఉపాధి పనులు జరిగే చోట కూలీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి క్షేత్రసహాయకులు చర్యలు తీసుకోవాలని ఏపీఓ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు.

భూకబ్జాదారులపై చర్యలు తీసుకోండి

పెనుకొండ: కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మడకశిర రోడ్డులో ఓ ముస్లిం కుటుంబానికి చెందిన భూమిలో భూకబ్జాదారులు షెడ్డు వేశారన్నారు. అనేకసార్లు అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని నాయకులు తెలిపారు. దీంతో బాధిత కుటుంబం తమను ఆశ్రయించడంతో అక్రమంగా వేసిన షెడ్డును బుధవారం తొలగించామన్నారు. భూయజమానులు ముకరం, మురసత్, అబ్బాస్, ఫర్దిన్, రీమాస్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణ, హనుమయ్య, జిల్లా ఉపాధ్యక్షులు జ్యోతమ్మ, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నాలుగు దరఖాస్తులు

మడకశిర: నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న 7 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు 4 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు స్థానిక సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. రొళ్ల మండలంలోని హనుమంతనపల్లి హెల్పర్ పోస్టుకు 3 దరఖాస్తులు వచ్చాయన్నారు. అదే విధంగా మడకశిర మున్సిపాలిటీలోని చౌటిపల్లి హెల్పర్ పోస్టుకు ఒక దరఖాస్తు మాత్రమే వచ్చిందన్నారు. మిగిలిన మడకశిర-11, దాసేగౌడనహళ్లి, నరసంబూది-1,అగ్రహారం, అమరాపురం -4 కేంద్రాలకు సంబంధించిన హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు రాలేదని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్



హిందూపురం: మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణాభివృద్ధి తనవంతు కృషి చేస్తానని ప్రమోద్‌కుమార్ తెలిపారు. కమిషనర్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ అభ్యర్థిగా లాయర్ కృష్ణానాయక్


పావగడ: స్థానిక విధాన సభ క్షేత్రం బీజేపీ అభ్యర్థిగా తాలూకాలోని పళవల్లి తండాకు చెందిన హైకోర్టు లాయర్ కృష్ణానాయక్‌ను బీజేపీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు కృష్ణానాయక్‌ను అభినందించారు.

రొద్దంలో ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న డీఎస్పీ హుస్సేన్‌పీరా

రొద్దం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమానికి పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా హాజరై భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మండుతున్న సూరీడు



ఎండకు తాళలేక కుషావతి నది బ్రిడ్జిపై చెట్టు కింద సేదదీరుతున్న వాహనదారులు

చిలమత్తూరు: మండలంలో రోజురోజుకూ ఎండలు పెరిగిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలో బుధవారం అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకావడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కాగా తెల్లవారు జామున మంచు కూడా పడుతుండటం విశేషం.

అందరికీ పనులు కల్పించాలి

గుడిబండ: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని ఏపీఓ భార్గవి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీల శాతం పెంచాలన్నారు. ప్రతి గ్రామంలోనూ జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలోనూ గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీ లక్ష్మానాయక్, టీఏలు, ఎఫ్‌ఏలు పాలల్గొన్నారు.